క్లుప్తంగా

విద్యారంగంపై ప్లీనరీలో చర్చ

తాళ్లరేవు: కాకినాడలో ఈనెల 3, 4 తేదీల్లో ఎస్ఎఫ్ఐ నిర్వహించనున్న జిల్లా ప్లీనరీ సమావేశాలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం ప్లీనరీ పోస్టర్‌ను విడుదల చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గంగా సూరిబాబు మాట్లాడుతూ, విద్యారంగ సమస్యలపై నిరంతరం రాజీలేని పోరాటం నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాలకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయడం వల్ల విద్య మొత్తం ప్రైవేటీకరణ అవుతుందన్నారు. రాష్ట్రంలో నేటికీ డిగ్రీ అడ్మిషన్స్ ప్రారంభించకుండా విద్యార్థులను చదువుకు దూరం చేసేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. విద్యారంగం అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ప్లీనరీలో చర్చిస్తామన్నారు.

వెనుకబడిన వర్గీయుల అభ్యున్నతికి కృషి



యాండ్ర ప్రభాకరరావు

కపిలేశ్వరపురం (మండపేట): నియోజకవర్గంలో వెనుకబడిన సామాజిక వర్గీయుల అభ్యున్నతికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా నియమితులైన మండపేట పట్టణానికి చెందిన యాండ్ర ప్రభాకరరావు (బుజ్జి) తెలిపారు. తనకు బాధ్యతలను అప్పగించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పర్యవేక్షణలో పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

విద్యుత్ చార్జీల దోపిడీపై ధర్నా

తాళ్లరేవు: విద్యుత్ చార్జీల నిలువు దోపిడీని అపాలని, ప్రమాదకర స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని మండల ప్రజావేదిక నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ఈనెల 5న తాళ్లరేవు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద జరిగే ధర్నాకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కరపత్రాలను అందజేశారు. ప్రజావేదిక నాయకుడు ఈశ్వరరావు మాట్లాడుతూ, అక్రమ ఒప్పందాలు, అవినీతి చర్యలతో ఖర్చులు పెంచి ప్రజల నుంచి ఈ సర్దుబాటు చార్జీలు వసూలు చేయడం అన్యాయమన్నారు. ప్రజలు వినియోగించే విద్యుత్ యూనిట్లకు అదనంగా సర్వీస్ చార్జీలు, ట్రూఅప్ చార్జీలు, డవలప్‌మెంట్ చార్జీల పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. ఆయా డిమాండ్లతో ఈ నెల 5న నిర్వహించే ధర్నాకు ప్రజలు హాజరుకావాలన్నారు.

భగవద్గీత శ్లోకాలపై చిన్నారులకు పోటీలు

అమలాపురం టౌన్: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక రావుల చెరువులోని రామాలయంలో చిన్నారులకు శ్లోక పఠన పోటీలు శనివారం నిర్వహించారు. పట్టణంలో పలువురు విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని భగవద్గీత శ్లోకాలను శ్రావ్యంగా ఆలపించారు. ఇస్కాన్ మేనేజర్ శివానంద నిమయి దాస్, ఇస్కాన్ ప్రతినిధులు శ్యామ్ సత్యధర్మ దాస్ తదితరుల సమక్షంలో ఈ పోటీలు జరిగాయి.

ప్రముఖ స్వీట్‌స్టాల్ వ్యాపారి మృతి



నగబత్తుల బ్రహ్మానందరావు (ఫైల్)

తాళ్లరేవు: మండలంలోని సంతపేట సెంటర్‌కు చెందిన ప్రముఖ స్వీట్‌స్టాల్ వ్యాపారి నగుబత్తుల బ్రహ్మానందరావు మృతి చెందారు. ఆయన గత నెల 29 నుంచి కనిపించట్లేదు. ఆయన మృతదేహం శనివారం రామన్నపాలెం సమీపంలో గోదావరిలో లభ్యమైంది. పోలీసులు పరిశీలించి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. గోదావరి వద్ద కాలకృత్యాలు తీర్చుకునే క్రమంలో ప్రమాదవశాత్తు పడిపోయి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. బ్రహ్మానందం మృతి పట్ల జెడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్ సాగర్, స్థానిక నాయకులు సంతాపం తెలిపారు.

ప్రజా సమస్యలు తెలుసుకోవాలి

అమలాపురం రూరల్: ప్రతి జిల్లా కార్యవర్గ సభ్యుడు, ప్రతి బూత్ సభ్యుడు వద్దకు వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కారానికి కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అన్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా బీజేపీ పదాధికారులు, కార్యవర్గ సభ్యుల సమావేశం అమలాపురం కాటన్ గెస్ట్ హౌస్‌లో ఆయన అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా పదాధికారులు, కార్యవర్గ సభ్యులకు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రజలకు నాయకులు అందుబాటులో ఉండాలన్నారు. జాతీయ కౌన్సిల్ మెంబర్, మాజీ ఎమ్మెల్యే మానే పల్లి అయ్యాజీ వేమా, జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు నల్లా పవన్ కుమార్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీ ప్రతిష్టం చేయాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి పాట్లూరి రామ్మోహన్ రావు, పూర్వపు జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కోసం.. పడిగాపులు

- షాపుల్లో యూరియా కొరత
- ఆర్‌బీకేల్లో నిల్వ ఉంచని అధికారులు
- కాంప్లెక్స్ ఎరువులు కూడా లేని పరిస్థితి



కాట్రేనికోనలో అధిక ధరలకు ఎరువులు అమ్మడంతో షాపును సీజ్ చేసిన అధికారులు (ఫైల్)

కాట్రేనికోన: తొలకరి పంట సాగుచేసేందుకు రైతులను మొదటి నుంచి కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఖరీఫ్ సాగుకు నీరందక సకాలంలో నారుమడులు వేయకపోగా.. కొందరు రైతులు ఇంజన్ల సాయంతో పంట కాలువల నుంచి నారుమడులకు నీరుపెట్టి సాగు ప్రారంభించారు. వరిసాగు ప్రారంభంలో దమ్ము చేసిన వరిచేలలో నాట్లు వేసే ముందు రైతులు యూరియా చల్లుతుంటారు. అధిక సంఖ్యలో వరినాట్లు బతుకుదల కోసం నత్రజని, పోషక విలువలు ఉన్న యూరియాను వరినాట్లు వేసే ముందు దమ్ము మీద లేదా తరువాత రోజు చల్లుతారు. ప్రస్తుతం యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

గత ప్రభుత్వంలో అందుబాటులో ఎరువులు

ముమ్మిడివరం నియోజకవర్గంలో కాట్రేనికోన, తాళ్లరేవు, ముమ్మిడివరం, ఐ.పోలవరం మండలాల్లో సుమారు 17 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేసేందుకు రైతులు నాట్లు వేస్తున్నారు. వీటిలో యాభైశాతం వరినాట్లు పూర్తయ్యాయి. గత ప్రభుత్వంలో రైతులకు సాగు నీటి కష్టాలు లేవు. వ్యవసాయ పరపతి సంఘాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు దళారుల నుంచి రైతులను రక్షించేందుకు గత ప్రభుత్వం ఎరువులను అందుబాటులో ఉంచింది. అనంతరం రైతులకు మరింత మేలు చేసేందుకు గ్రామ స్థాయిలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచి ధాన్యాన్ని ప్రభుత్వం ఆర్బీకే కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేది. ప్రైవేటు ఎరువుల వ్యాపారులను ప్రోత్సహించే విధంగా వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో నడుస్తున్న ఆర్‌బీకే కేంద్రాల్లో ఎరువులు మొక్కుబడిగా ఉండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆర్‌బీకేల్లో అందుబాటులో లేని యూరియా

కాట్రేనికోన మండలంలోని 16 పంచాయతీల పరిధిలో 22 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. చెయ్యేరు ఆర్‌బీకేలో 12 టన్నుల యూరియా మాత్రమే ఉంది. వాటిని రైతులు తీసుకెళ్లడంతో యూరియా కొరత ఏర్పడింది. ఇతర కాంప్లెక్స్ ఎరువులు కూడా లేవు. ప్రభుత్వ ధరల ప్రకారం యూరియా బస్తా రూ.270లకు అమ్మవలసి ఉంది. ఆర్‌బీకేలపై రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలనే కచ్చితమైన ఆదేశాలు ప్రభుత్వం నుంచి లేకపోవడంతో సంబంధిత అధికారులు అలసత్వం వహిస్తున్నారు. కాట్రేనికోనలోని ఓ ట్రేడర్సులో యూరియాను అధిక ధరలకు విక్రయిస్తుండంతో వ్యవసాయ శాఖ అధికారులు దానిని సీజ్ చేశారు. ప్రభుత్వ ధరలకు అమ్మకాలు చేస్తే గిట్టుబాటు కాకపోవడంతో యూరియా అమ్మకాలను నిలిపేసి కాంప్లెక్స్ ఎరువులు మాత్రమే అమ్ముతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి యూరియాతో పాటు, ఇతర కాంప్లెక్స్ ఎరువులను ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కాట్రేనికోనలో రైతు భరోసా కేంద్రం

ఆర్‌బీకేలకు ఆర్డర్ పెట్టాం

చెయ్యేరులో 12 టన్నులు యూరియాను రైతులకు అందుబాటులో ఉంచగా.. వాటిని తీసుకెళ్లడంతో కందికుప్ప, పల్లంకుర్రు ఆర్‌బీకేలకు 20 టన్నుల చొప్పున యూరియాను ఆర్డరు పెట్టాం. కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంచుతాం. వ్యవసాయ పరపతి సంఘాలు కందికుప్ప, పల్లంకుర్రు, కాట్రేనికోన, చెయ్యేరు లైసెన్సులు రెన్యూవల్ చేసుకోవాలి. ప్రైవేటు వ్యాపారులను సంప్రదించి రైతులకు యూరియా అందించేందుకు కృషి చేస్తాం.

– మృధుల, వ్యవసాయ శాఖ అధికారి, కాట్రేనికోన

యూరియా లేక ఇబ్బందులు పడుతున్నాం



ఆర్‌బీకేలలో యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులు లేకపోవడంతో ప్రైవేటు షాపులో సుమారు 15 బస్తాలు కాంప్లెక్స్ ఎరువులు కొనుగోలు చేశాను. ఒక బస్తా యూరియా కూడా దొరకలేదు. దమ్ము చేసిన తరువాత నాట్లు వేసే ముందు యూరియా చల్లాలి. సుమారు 25 ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. సాగునీరు సక్రమంగా అందట్లేదు. ఎరువులు ఆర్‌బీకేలలో దొరకడం లేదు.

– పులుగు దశరథమహారాజు, కౌలు రైతు, పల్లంకుర్రు.

దొరబాబుకు మాజీ ఎమ్మెల్యే అభినందనలు



దొరబాబును అభినందిస్తున్న పొన్నాడ

ముమ్మిడివరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ సెక్రటరీగా నియమితులైన వల్లభుని నాగూర్ దొరబాబును నియోజకవర్గ సమన్వయకర్త పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అభినందించారు. అభినందించిన వారిలో పి.గన్నవరం నియోజకవర్గ పార్టీ పరిశీలకులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ కోలా గంగా భవానీ, కోలా బాబ్జి, పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆర్థిక సాయం

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వర డిగ్రీ కళాశాల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు గుండె, కిడ్నీ రోగాలతో బాధపడుతున్న ఇద్దరి బాధితులకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. అమలాపురం రూరల్ మండలం రోళ్లపాలేనికి చెందిన గుండెజబ్బుతో బాధపడుతున్న చిన్నారి భార్గవ్ రామ్‌కు రూ.5 వేలు, రావులపాలేనికి చెందిన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నారాయణరావుకు రూ.5 వేలు ఇచ్చారు. కళాశాల కరస్పాండెంట్ కేవీఆర్ఎస్ నరసింహరావు, ప్రిన్సిపాల్ కె.మనోహర్, ఈవో కరాటం ప్రవీణ్, అధ్యాపకులు కళాశాల వద్ద రోగుల కుటుంబీకులకు శనివారం అందజేశారు.

అమలు కాని హామీలిచ్చిన చంద్రబాబు

కాట్రేనికోన: అమలు కాని హామీలతో అధికారం చేపట్టిన చంద్రబాబు నాయుడు మోసం చేశారని జెడ్పీటీసీ నేల కిషోర్ ఎద్దేవా చేశారు. బలుసుతిప్ప సర్పంచ్ మల్లాడి ఏడుకొండలు అధ్యక్షతన శనివారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి ఎన్నికల ముందు మ్యానిఫెస్టోలో బాబు ప్రజలకు ఇచ్చిన హామీలను వివరించారు. వేర్వేరు సాకులతో లబ్ధిదారులను తొలగించి పింఛను, ఉచిత గ్యాస్ తప్ప చేసింది ఏమిలేదన్నారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను వివరించారు. క్యూఆర్ కోడ్‌తో ఉన్న బ్రోచర్లను అందజేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లాడి వీరబాబ్జి, మల్లాడి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఈ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి



అరుణ కుమార్‌ను అభినందిస్తున్న యాజమాన్యం

కాట్రేనికోన: చెయ్యేరు శ్రీనివాస అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగం ఉపాధి శిక్షణాధిపతిగా పని చేస్తున్న అరుణ కుమార్ అన్నమాలై యూనివర్సిటీ అల్ట్రా సౌండ్ చిత్రాల్లో లోతైన నాడీ నెట్‌వర్క్‌లో థైరాయిడ్ నాడ్యూల్ వర్గీకరణ పీహెచ్‌డీ పూర్తి చేశారు. సిద్ధాంత వ్యాసాన్ని యూనివర్సిటీ సీఎస్ఈ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ప్రియా పర్యవేక్షణలో పరిశీలన బృందానికి సమర్పించగా ఆమోదం పొందింది. కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ డీవీఎస్ఎన్ వర్మ అధ్యక్షతన శనివారం అరుణ కుమార్ పీహెచ్‌డీ పూర్తి చేసిన సందర్భంగా కళాశాల యాజమాన్యం అభినందించారు.

మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కూటమి

నియోజకవర్గ కో–ఆర్డినేటర్ శ్రీకాంత్



భట్నవెల్లిలో కూటమి మోసాలను క్యూఆర్ కోడ్‌తో వివరిస్తున్న శ్రీకాంత్



ప్రజలకు బోచర్ అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అమలాపురం రూరల్: కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష పార్టీ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. మంత్రి లోకేశ్ రచించిన రెడ్ బుక్ రాజ్యాంగంతో తప్పుడు సాక్ష్యాలు సృష్టిస్తున్నారన్నారు. అమలాపురం మండలంలోని భట్నవెల్లి, రెడ్డిపల్లి, సవరప్పాలెం గ్రామాల్లో శనివారం బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో జగన్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలతోపాటు, మరిన్ని పథకాలు ఇస్తామని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర కావస్తున్న ఏ ఒక్క పథకం సక్రమంగా అమలు చేయలేదన్నారు. చంద్రబాబు, పవన్ వైఫల్యాలను ఈ కార్యక్రమం ద్వారా కార్యకర్తలు గ్రామస్థాయిలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గుత్తుల చిరంజీవిరావు, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ శ్రీహరిరామ్ గోపాల్, వైస్ ఎంపీపీ బాలకృష్ణ, నియోజకవర్గ పరిశీలకులు శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వరబాబు, జిల్లా మాజీ కార్యదర్శి సరేళ్ల రామకృష్ణ, సర్పంచ్‌లు తిరుకోటి సుజాత, పొణకల గణేష్, యుత్ విభాగం అధ్యక్షుడు కేతా భాను, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఇళ్ల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాలతో గద్దెనెక్కిన చంద్రబాబు

అమలాపురం టౌన్: అబద్ధాలతో, సాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు మాటలకు ఈసారి మోసపోయి మరోసారి కష్ట, నష్టాల్లో పడొద్దని అమలాపురంలోని 1, 2, 3, 4, 30 వార్డుల ప్రజలకు వైఎస్సార్ సీపీ నాయకులు వివరించారు. ఈ ఐదు వార్డుల్లో శనివారం నిర్వహించిన ×బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ× కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాల చిట్టాను వివరిస్తూ ప్రచారం చేశారు. బాబు మోసాలతో ఉన్న క్యూఆర్ కోడ్ పత్రాలను విడుదల చేశారు. చింతగుంట చెరువు, రావుల చెరువు, వంటెద్దు వీధి తదితర ప్రాంతాల్లో పార్టీ నేతలు పర్యటించారు. చంద్రబాబు అబద్ధాలను నమ్మి మళ్లీ ఓటేస్తే మనం కూర్చున్న కొమ్మను మనమే నరుక్కున్నట్లు అవుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. గత ప్రభుత్వంలో జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన సంక్షేమ పథకాలతో ప్రజలు సుభిక్షంగా ఉంటే ఇప్పుడు బాబు పాలనలో ఆర్థిక సంక్షోభాన్ని చవి చూస్తున్నారన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు యన్నాబత్తుల పద్మ, దొంగ నాగ సుధారాణి, కొల్లాటి దుర్గాబాయి, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని వెంకట చంద్రశేఖర్, పార్టీ జిల్లా కార్యదర్శి కముజు రమణ, నాయకులు ఉండ్రు బాబ్జి, సుంకర సుధ, పార్టీ సీనియర్ నాయకులు మంథా శివ, కుడుపూడి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనంతా మోసమే

– ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: ఎన్నికల ముందు సాధ్యం కాని హామీలను ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలంటే రాష్ట్ర బడ్జెట్ సరిపోదని, ఏపీని అమ్మేయాలని ప్రకటనలు చేస్తూ పథకాలను ఎగవేతకు కూటమి నేతలు పాల్పడుతున్నారని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ అన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం ఓడలరేవు, బెండమూర్లంక, తుమ్మలపల్లి గ్రామాల్లో శనివారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. చంద్రబాబు పాలనంతా మోసపూరితమేనని పేర్కొన్నారు. అధికారం కోసం సాధ్యం కాని హామీలు ప్రకటించడం, తీరా అమలు చేసే సమయానికి ఏదో సాకుతో వాయిదాలు వేయడం, అనుభవం ముసుగులో ప్రజలను మభ్యపెట్టి మాయ చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. ఏడాదికి 4లక్షల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి 14 నెలలు కావస్తున్నా ఒక్కటైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. నిరుద్యోగ యువకులకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు ప్రకటన గాలిలో కలిసిపోయిందని ఎద్దేవా చేశారు. ఏహామీ కుడా పూర్తిస్థాయిలో చేయకపోవడం వారికే చెల్లుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు బాపూజీ, వైఎస్ ఎంపీపీ వడ్డి గంగ, రాష్ట్ర నాయకులు నాతి శ్రీనివాసరావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతా రామకృష్ణ, సర్పంచ్ బర్రే సీతారత్నం, ఎంపీటీసీ రాజేశ్వరీ, సీనియర్ నాయకులు ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన ఘనత చంద్రబాబుదే

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, కో–ఆర్డినేటర్ శ్రీకాంత్

ఉప్పలగుప్తం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమాలు అందించిన ఘనత జగన్‌దైతే అధికారంలోకి రావటం కోసం ప్రజలను నిలువెత్తు మోసం చేసిన ఘనత చంద్రబాబుదని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, అమలాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ ప్రజలకు వివరించారు. మండలంలోని చల్లపల్లి, ఎస్.యానం, సరిపల్లి గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జీ అధ్యక్షతన శనివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ చంద్రబాబు చేస్తున్న మోసాల గురించి ప్రజలకు వివరించారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలను గుర్తుచేసుకోవాలని క్యూఆర్ కోడ్‌తో ఉన్న బ్రోచర్‌లను అందించారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ, జగన్ పెట్టిన సంక్షేమ పథకాలకు పేర్లు మార్చి గొప్పలు చెప్పుకుంటున్న చంద్రబాబు, పేద ప్రజల జీవితాల్లో జగన్ మార్క్‌ను తొలగించలేరన్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ, కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కక్ష్య పూరిత పరిపాలన చేస్తూ ప్రజాపాలన మరిచారన్నారు. సరిపల్లి గ్రామంలో పలువురు శ్రీకాంత్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకీ, వైస్ ఎంపీపీ సాదే శ్రీనువాసరావు, రాష్ట్ర కార్యదర్శులు దంగేటి రాంబాబు, బొడ్డు బుజ్జి, సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, యర్రంశెట్టి రామచంద్రరావు, ఎంపీటీసీ సభ్యులు పెట్టా అప్పారావు, కొంకి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం



చొల్లంగిలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ



తల్లిపాల ప్రాధాన్యంపై ర్యాలీ

అమలాపురం రూరల్: తల్లి పాలు అమృతం వంటివని, పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని శిశు సంక్షేమ శాఖ కోనసీమ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంతి కుమారి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అమలాపురంలోని శిశు గృహ వద్ద శనివారం జరిగిన జిల్లా స్థాయి తల్లిపాల వారోత్సవాల సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల ఎంతో ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. ఏ విధమైన అపోహలకు పోకుండా బిడ్డ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తల్లిపాలు ఇవ్వాలని కోరారు. అనంతరం తల్లిపాల ప్రాముఖ్యతపై నిర్వహించిన ర్యాలీలో పీడీతోపాటు జిల్లాలోని ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలకు తల్లిపాలనే ఇవ్వాలి

తాళ్లరేవు: బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లికి, బిడ్డకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని, అపోహలు వీడి పిల్లలకు తల్లిపాలనే ఇవ్వాలని తాళ్లరేవు సీడీపీఓ వంజరాన మాధవి కోరారు. మండలంలో ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం ఇంజరం సెక్టార్ పరిధిలోని ఎంఎల్‌కె నగర్, తాళ్లరేవు సెక్టార్ పరిధిలోని మార్కెట్ వీధి, గాడిమొగ–3, చొల్లంగి–1, అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మాధవి మాట్లాడుతూ, తల్లిపాలు ఇవ్వడం వల్ల ప్రసవానంతరం రక్తస్రావం తగ్గించడం, గర్భాశయం సాధారణ స్థితికి రావడం, రొమ్ము, అండాశయ క్యాన్సర్, అధిక రక్తపోటు వంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గుతాయన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రమాణ స్వీకారోత్సవం



సుంకరపాలెం స్కూల్‌లో ప్రతినిధులుగా ఎన్నికైన విద్యార్థులు

తాళ్లరేవు: మండల పరిధిలోని సుంకరపాలెం శ్రీచైతన్య స్కూల్‌లో శనివారం నిర్వహించిన ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి యానాం ఇన్‌చార్జ్ ఎస్పీ అడల్‌రసన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశ చాలా ముఖ్యమైనదని, అబ్దుల్ కలాం అంత గొప్ప వ్యక్తిగా మారడానికి ఆయన బాల్యంలో కన్నకలలు వాటిని సాధించడానికి ఆయన అలవర్చుకున్న క్రమశిక్షణతో దేశానికి రాష్ట్రపతి అయి అందరికీ ఆదర్శ ప్రాయుడయ్యారన్నారు. చిన్నతనం నుంచే ఎన్నికల పట్ల అవగాహన కల్పించేలా స్కూల్ స్థాయిలోనే ఎన్నికలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ నూకరాజు మాట్లాడుతూ, రేపటి పౌరులైన విద్యార్థులకు ప్రజాస్వామ్య విలువలను స్కూల్ స్థాయి నుంచే అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ మద్దింశెట్టి శేషగిరిరావు, తోట వెంకటరత్నం, పీఈటీ హరీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణానికి ఏర్పాట్లు



కొత్త టిమ్ గురించి వివరిస్తున్న రాఘవ కుమార్

అమలాపురం రూరల్: ఆగస్టు 15 నుంచి ప్రభుత్వం ప్రారంభించే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామని ఆర్టీసీ కోనసీమ జిల్లా ప్రజా రవాణా అధికారి రాఘవ కుమార్ తెలిపారు. ఈమేరకు జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలో బస్సుల మెయింటెనెన్స్‌పై దృష్టి సారించి నూతన పద్ధతుల ద్వారా అన్ని బస్సుల కండిషన్ తనిఖీ చేసి, కావలసిన విడి భాగాలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే రీజినల్ టెండర్ల ద్వారా అన్ని కేటగిరీల్లో ఉన్న ఖాళీలను అవుట్ సోర్సింగ్ విధానం ద్వారా భర్తీ చేస్తామని చెప్పారు. దశలవారీగా ఇప్పటికే 80 బస్సులు అటెండ్ చేసినట్లు తెలియజేశారు. ఈ మధ్య కాలంలో కొత్త బస్సుల ద్వారా రీప్లేస్మెంట్ అయిన సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ బస్సులను సుమారు 20 బస్సుల వరకు పల్లె వెలుగు బస్సులుగా బాడీ కన్వర్షన్ చేయించి కంప్లీట్ బాడీ ఓవర్ హాలింగ్ ద్వారా బస్సుల కండిషన్ మెరుగుపరిచామన్నారు. మహిళల ఉచిత బస్సు సర్వీసుల ప్రారంభ దశలో ఎదురయ్యే సమస్యలను ముందుగా ఊహించి తదనుగుణంగా ఆర్టీసీలో అంతర్భాగంగా డ్రైవర్లు, కండక్టర్లకు తగిన సూచనలు చేస్తున్నామని తెలిపారు. టికెట్ ఇష్యూయింగ్ మెషిన్ (టిమ్) ఉచిత టిక్కెట్లు ఇవ్వడానికి జిల్లాలోని కండక్టర్లకు నూతన సాఫ్ట్‌వేర్‌పై గత నాలుగు రోజుల నుంచి టిమ్ గురించి శిక్షణ నిర్వహిస్తున్నారు. మహిళా ప్రయాణికులకు ఏ విధమైన ఇబ్బందులు రాకుండా బస్ స్టేషన్లలో అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

యువకుడిపై హత్యయత్నం కేసు

అమలాపురం రూరల్: మండలంలోని సాకుర్రు గ్రామానికి చెందిన విప్పర్తి హర్షవర్ధన్‌పై పోలీసులు హత్యయత్నం కేసు నమోదు చేశారు. ఎస్సై శేఖర్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. హర్షవర్ధన్ ఆర్థికంగా నష్టపోవడంతో తన తండ్రి చనిపోతే ఇన్సూరెన్స్ డబ్బులు పొందవచ్చని పన్నాగం వేశాడు. ఏప్రిల్ నెలలో తన తండ్రి వెంకటరమణ కామనగరువు బైపాస్‌లో బైక్‌పై వెళుతుండగా ముందస్తు వ్యూహంలో భాగంగా తన స్నేహితుడి కారుతో ఢీకొట్టించి యాక్సిడెంట్ కేసుగా అమలాపురం తాలూకా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. తండ్రి వెంకటరమణ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకున్న అనంతరం డిశ్చార్జ్ అయ్యారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేయగా.. విషయం వెలుగులోకి వచ్చింది. వీఆర్‌ఓ ఫిర్యాదుతో హర్షవర్ధన్‌ను అరెస్ట్ చేసి శనివారం కోర్టులో హాజరుపరిచామన్నారు.

వీరేశ్వరస్వామి సన్నిధిలో చంద్రకుమార్ దంపతులు

ఐ.పోలవరం: ఏపీ దేవాదాయశాఖ అదనపు కమిషనర్ తెనాలి చంద్రకుమార్ దంపతులు శనివారం మురమళ్ల వీరేశ్వర స్వామిని దర్శించుకున్నారు. తొలుత వీరికి ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ పట్టువస్త్రాలు సమర్పించి దుశ్శాలువాతో సత్కరించారు. స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. అర్చకులు, పురోహితులు వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు.